
సాక్షి
అనకాపల్లి
గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



అప్పన్న హుండీ లెక్కింపు

సింహాచలం: అప్పన్న హుండీల ద్వారా రూ.65,47,436 నగదుతో పాటు 31.200 గ్రాముల బంగారం లభించింది.



రామ్‌చరణ్‌కు వీడ్కోలు

విశాఖ: శంకర్ సినిమా చిత్రీకరణ పూర్తి కావడంతో హీరో రామ్‌చరణ్ విమానంలో హైదరాబాద్ పయనమయ్యారు.



క్రికెట్ పోటీలు ప్రారంభం

పరవాడ: విశాఖ ఫార్మాసిటీ, రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో క్రికెట్ టోర్నమెంట్‌ను రాంకీ ఎండీ లాల్‌కృష్ణ ప్రారంభించారు.

న్యూస్‌రీల్

108లో సుఖ ప్రసవం



108 వాహనంలో ప్రసవించిన తల్లి బిడ్డతో ఈఎంటీ దేముళ్లు

దేవరాపల్లి: పురిటినొప్పులతో బాధపడుతున్న గిరిజన మహిళను 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రసవించింది. విజయనగరం జిల్లా వేపాడ మండలం కరకవలస పంచాయతీ శివారు మారిక గ్రామానికి చెందిన పాతబోయిన దేముడమ్మకు బుధవారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం అందించారు. డోలీలో దేవరాపల్లి మండలం గిరిజన పంచాయితీ తామరబ్బ శివారు కొండకోడాబు గ్రామానికి తీసుకువచ్చారు. అప్పటికే సిద్ధంగా ఉన్న 108 వాహనంలో వేపాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే ప్రసవించి దేముడమ్మ పండంటి ఆడ బిడ్డకు జన్మినిచ్చింది. ఈఎంటీ పి.దేముళ్లు చాకచక్యంగా వ్యవహరించి సాధారణ ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. తదుపరి చికిత్సకు తల్లీ బిడ్డలను వేపాడ పీహెచ్‌సీకి తరలించారు. తన భార్యకు సుఖ ప్రసవం అయ్యేలా చేసిన ఈఎంటీ పి.దేముళ్లుకు, ఆశా కార్యకర్త బుచ్చమ్మకు ఆమె భర్త దేముడు ఇతర కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సమస్యలకు పరిష్కారం

'గడప గడపకు మన ప్రభుత్వం' ఫలితం



చౌడువాడలో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కె.కోటపాడు: చౌడువాడ గ్రామంలో ఇటీవల 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి వచ్చిన విద్యుత్ సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు ప్రారంభించారు. రెండు రోజులు పనులు చేసి గవరపేట, బీసీ కాలనీలో విద్యుత్ స్తంభాలను మార్చి, ఎలక్ట్రికల్ ఏఈ చంద్రశేఖర్, లైన్‌మన్ శ్రీను కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. డిప్యూటీ సీఎం సూచనల మేరకు పాడైన స్తంభాలను మార్చి కొత్త స్తంభాలను వేశారు. ఒరిగిన స్తంభాలను, ఇంటిపై వేలాడుతున్న తీగెలను సరిచేస్తున్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలకు కృషి

రాష్ట్ర బీసీ గురుకుల పాఠశాలల కార్యదర్శి కృష్ణమోహన్



విద్యార్థితో మాట్లాడుతున్న కృష్ణమోహన్

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను రాష్ట్ర బీసీ గురుకుల పాఠశాలల కార్యదర్శి కృష్ణమోహన్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. నెల రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను సందర్శించనున్నట్టు తెలిపారు. పాఠశాలలో పారిశుధ్య స్థితిగతులను పరిశీలించారు. పిల్లల భోజన మెనూను ఆరా తీశారు. ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

96 మంది ఉద్యోగులకు నెహ్రూ అవార్డులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం 96 మంది ఉద్యోగులను జవహర్‌లాల్ నెహ్రూ అవార్డులకు ఎంపిక చేసింది. స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేసే ఉద్యోగులకు యాజమాన్యం ఏటా ఈ అవార్డులను ఇస్తారు. ఫిబ్రవరి 18న స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులను అందజేస్తారు. ఈ ఏడాదికి గాను 49 మంది అధికారులు, 47 మంది కార్మికులను యాజమాన్యం ఎంపిక చేసింది.

నేటి నుంచి 'పట్టభద్రుల' నామినేషన్ల స్వీకరణ

- ఇప్పటికే నామినేషన్ పత్రాలు తీసుకున్న 12 మంది
- తొలి నామినేషన్ వేయనున్న ప్రజాసంఘాల ఉమ్మడి అభ్యర్థి
- ఈ ఎన్నికకు వైట్ కలర్ బ్యాలెట్ పేపర్ కేటాయింపు
- ఉద్యోగులకు సెలవులు రద్దు



నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విశాఖ డీఆర్‌వో శ్రీనివాసమూర్తి



ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ పరిధిలో 100 మీటర్ల వరకూ 144 సెక్షన్ విధించారు. నామినేషన్ల స్వీకరణకు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్(ఎన్ఐసీ)ని హెల్ప్‌డెస్క్‌గా ఏర్పాటు చేశారు. అభ్యర్థులు, బలపరచనున్న వ్యక్తులు ఈ హెల్ప్‌డెస్క్‌లో నామినేషన్లకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకొని.. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, కలెక్టర్ డా.మల్లికార్జునకు అందజేయనున్నారు. అభ్యర్థులు, వారి వెనుక వచ్చే వారు నిరీక్షించేందుకు సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ నెల 23వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఇప్పటికే 12 మంది నామినేషన్ పత్రాలు తీసుకున్నారు. సెలవు రోజుల మినహా మిగిలిన రోజుల్లో నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు అవకాశాన్ని కల్పించారు. నామినేషన్లకు వచ్చే అభ్యర్థుల చర్యలను పర్యవేక్షించడంతో పాటు ఎన్నికల సంఘానికి పంపించేందుకు వీడియో రికార్డింగ్ ఏర్పాట్లు కూడా చేశారు. దీనికి సంబంధించి కలెక్టరేట్ నుంచి మోనటరింగ్ వ్యవస్థను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు డీఆర్‌వో వెల్లడించారు. మరోవైపు.. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పాటించాల్సిన నియమ నిబంధనలపై చీఫ్ ఎలక్టోరల్ కార్యాలయ అధికారులు డీఆర్‌వో, పోలింగ్ సిబ్బందికి వర్చువల్ విధానంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్, రెవెన్యూ పరిధిలో ఉన్న ఉద్యోగులకు అత్యవసర మినహా సెలవులు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

బ్యాలెట్‌పై అభ్యర్థి పేరు, ఫొటో, పార్టీ పేరు

పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి తెల్ల రంగు బ్యాలెట్ పేపర్‌ని ముద్రిస్తారు. బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లు వరుస క్రమం జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు, ఇండిపెండెంట్స్ క్రమంలో ఆల్ఫాబెట్స్ ఆధారంగా ముద్రిస్తారు. బ్యాలెట్ పేపర్‌పై సీరియల్ నంబర్ తర్వాత అభ్యర్థి పేరు బ్రాకెట్‌లో బలపరిచిన పార్టీ పేరు, ఫొటో ముద్రిస్తారు. చివరి కాలమ్‌లో అభ్యర్థిని బలపరిచే ప్రాధాన్యత సంఖ్యని ఓటరు వేసే విధంగా ఉంచేలా ముద్రిస్తారు. ఇప్పటివరకు 2.87 లక్షల పైచిలుకు ఓటర్లున్నట్లుగా గుర్తించారు. మరికొన్ని దరఖాస్తులు ఇంకా పరిశీలనలో ఉన్నాయి.

ముహూర్తం చూసుకుంటున్న అభ్యర్థులు

ఇప్పటికే ప్రచారంలో తలమునకలై ఉన్న అభ్యర్థులు నామినేషన్ల పర్వం ప్రారంభమైన నేపథ్యంలో దానికి సంబంధించిన ఏర్పాట్లపై ప్రధాన దృష్టి సారించారు. మంచి ముహూర్తాల కోసం వెతుకులాట ప్రారంభించారు. తమ పేరు, జాతకరీత్యా కలిసొచ్చే ముహూర్తం వేటలో ఉన్నారు. 23వ తేదీ వరకు సమయం ఉండటంతో వారం వర్జ్యం చూసుకుంటున్నారు. మరోవైపు.. తొలిరోజునే మొదటి నామినేషన్ వేసేందుకు ప్రజాసంఘాల ఉమ్మడి అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ సిద్ధమయ్యారు. ఉదయం 11 గంటలకు ర్యాలీగా బయలుదేరి నామినేషన్ వేయనున్నారు.

11 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు

జీవీఎంసీ పరిధిలో ఉన్న 8 జోనల్ కార్యాలయాలకు సంబంధించిన జోనల్ కమిషనర్లకు ఎన్నికల ప్రవర్తన నియమావళి పరిశీలకులుగా నియమించారు. అదేవిధంగా 11 మంది తహసీల్దార్లను ఫ్లయింగ్ స్క్వాడ్స్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి తహసీల్దారుతో ఒక వీడియోగ్రాఫర్ కూడా ఉంటారు. నామినేషన్లు వేసే అభ్యర్థుల సంఖ్యను బట్టి ఫ్లయింగ్‌స్క్వాడ్స్‌ని పెంచే అవకాశం ఉందని డీఆర్‌వో తెలిపారు.

● శివపూజకు వేళాయె..



చోడవరంలోని ప్రసిద్ధ స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు కల్యాణోత్సవాలు జరిపేందుకు సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. గురువారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం తిరువీధోత్సవం, రాత్రి స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహిస్తారు. సినీ, నాటక రంగ ప్రముఖులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆరు రోజులపాటు సురభి నాటకాలను ప్రదర్శించనున్నారు.

- 8లో

చెరకులో కొత్త వంగడం అరుంధతి

- హెక్టార్‌కు 130 టన్నుల ఉత్పత్తి
- విత్తనోత్పత్తి విభాగ ప్రధాన శాస్త్రవేత్త ఆదిలక్ష్మి



అధిక ఉత్పత్తిని సాధించే కొత్త చెరకు వంగడం

అనకాపల్లిటౌన్: అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో చెరకులో కొత్త వంగడం అరుంధతి (2012ఎ319)ని రూపొందించినట్టు విత్తనోత్పత్తి విభాగ ప్రధాన శాస్త్రవేత్త ఆదిలక్ష్మి బుధవారం మీడియాకు వెల్లడించారు. ఈ వంగడాన్ని జాతీయ స్థాయిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. గతంలో కోఎ2005ఎ128 ఒక వంగడాన్ని విడుదల చేసినట్టు చెప్పారు. అరుంధతి వంగడం హెక్టార్‌కు 130 టన్నుల చెరకు ఉత్పత్తితో, 16 టన్నుల బెల్లం, 17.5 టన్నుల పంచదార, 19 శాతం చెరకు రికవరీ తెస్తుందన్నారు. తుపాను గాలులకు తట్టుకోగల సామర్థ్యంతోపాటు పసుపాకుపచ్చ, ఎర్రకుళ్లు తెగుళ్లను కూడా తట్టుకుంటుందన్నారు. ఈ వంగడం ద్వారా అధిక పిలకలు ఉత్పత్తవుతాయని వెల్లడించారు. అఖిల భారత చెరకు పరిశోధనా పథకం సబ్ కమిటీ ఈ విత్తనాన్ని ఆమోదించి, జాతీయ కమిటీకి నివేదిక పంపించినట్లు తెలిపారు.

అయ్యన్న వైఖరితో టీడీపీకి గడ్డు పరిస్థితి

- బీసీ ద్రోహిని చంద్రబాబు కట్టడి చేయాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ రెబల్ అభ్యర్థి శ్రీరామ్మూర్తి



నర్సీపట్నం/రోలుగుంట: మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యవహారశైలితో టీడీపీకి తీవ్ర నష్టం జరుగుతుందని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ స్థానానికి పోటీ పడుతున్న టీడీపీ రెబల్ అభ్యర్థి ఈర్లె శ్రీరామ్మూర్తి విమర్శించారు. బుధవారం నర్సీపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులాన్ని అడ్డుపెట్టుకుని అయ్యన్నపాత్రుడు బతికేస్తున్నాడని మండిపడ్డారు. చంద్రబాబు తనకు ఎమ్మెల్సీ సీటు ఇద్దామనుకున్నా, తాను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో సన్నిహితంగా ఉంటాననే అక్కసుతో అయ్యన్నపాత్రుడు తనకు సీటు రాకుండా అడ్డుపడ్డారన్నారు. విభేదాలుంటే వారిద్దరూ చూసుకోవాలి తప్ప అయ్యన్నపాత్రుడు తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. అయ్యన్నపాత్రుడి వల్ల బీసీలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఆయన ఒంటెద్దుపోకడతో వెనుకబడిన వర్గాలు టీడీపీకి దూరమవుతున్నారన్నారు. చంద్రబాబు ఇప్పటికైనా అయ్యన్నపాత్రుడిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ ఉద్యమాన్ని నర్సీపట్నం నుంచి ప్రారంభించి ఉత్తరాంధ్ర జిల్లాల్లో టీడీపీ వైఖరిని ఎండగడతానన్నారు. రెవెన్యూ, పంచాయతీ, ఉపాధ్యాయ సంఘాలతో మంచి అనుబంధం ఉందని, ఎన్నికలలో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

బుజ్జగింపులకు తలొగ్గేది లేదు

తాను టీడీపీలో ఏ నాయకుల బుజ్జగింపులకు తలొగ్గేది లేదని, త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసి తీరతానని ఈర్లె శ్రీరామ్మూర్తి చెప్పారు. బుధవారం రోలుగుంట వచ్చిన ఆయన తనకు ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని ఓటర్లను కలిసి కోరారు.

సిటీ బ్యూటీ కోసం..

చురుగ్గా విశాఖ నగర సుందరీకరణ



మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్ (విశాఖ): జీ–20 సదస్సు నేపథ్యంలో నగర సుందరీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రోడ్లు, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, విద్యుత్, పారిశుధ్యం, బ్యూటిఫికేషన్ వంటి పనులు చేపడుతున్నారు. ఆర్కే బీచ్ తరహాలోనే జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్, ఇస్కాన్ టెంపుల్ బీచ్‌ను ఆధునికీకరించేందుకు సిద్ధమయ్యారు. పార్కింగ్ స్థలాలు, బెంచ్‌లు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో కమిషనర్ పి.రాజాబాబు జీ–20 సదస్సు ఏర్పాట్ల వివరాలు వెల్లడించారు. ముందస్తు ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. జీవీఎంసీ పరిధిలో రోడ్లు, మీడియన్లు, పెయింటింగ్, బీచ్ అభివృద్ధి, జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయని.. ఏపీ గ్రీన్ కార్పొరేషన్ సహాయంతో గ్రీనరీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

ఫుట్‌పాత్‌ల ఆధునికీకరణ

ఫుట్‌పాత్‌లను ఆధునికీకరిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులకు వెండర్స్ జోన్స్ ఏర్పాటు చేసి, వారిని అక్కడకు తరలిస్తామన్నారు. ఆయా జోన్ల పరిధిలోని ఖాళీ స్థలాలు, రద్దీ లేని సర్వీస్ రోడ్లలో వెండర్స్ జోన్ ఏర్పాటు చేస్తామన్నారు. తెలుగుతల్లి ఫ్లైఓవర్‌ను మరింత అభివృద్ధి చేసి.. ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామన్నారు.

బీచ్‌రోడ్‌లో 40 సీసీ కెమెరాలు ఏర్పాటు

బీచ్ రోడ్డులో 40 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. రాత్రి వేళల్లో స్పీడ్‌గా/ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారి కోసం ఆటోమేటిక్ స్పీడ్ రికార్డర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పారిశుధ్య పనులు 24 గంటలూ కొనసాగుతున్నాయని.. టెండర్లలో పారదర్శకత పాటిస్తున్నట్లు తెలిపారు. భీమిలి జోన్‌లోని డంపింగ్ యార్డ్ తప్పితే.. మిగిలిన అన్ని డంపింగ్ యార్డ్‌లను క్లియర్ చేశామన్నారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యాన్ చేసిన దృష్ట్యా జీవీఎంసీ పరిధిలో డిజిటల్ బోర్డులు ఏర్పాటుకు అనుమతిస్తున్నట్లు చెప్పారు. అదనపు కమిషనర్లు, ప్రధాన ఇంజినీర్ పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రాలకు రాయితీ రుణాలు

- జిల్లాలోని 179 రైతు గ్రూపులకు రూ.26.85 కోట్లు
- త్వరలో మంజూరు–వ్యవసాయ శాఖ జేడీ మోహన్‌రావు



నాతవరం ఆర్‌బీకేలో సిబ్బందితో సమావేశమైన జేడీ మోహన్‌రావు

నాతవరం: జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కొనుగోలు చేసే రైతు సంఘాలకు రూ.26.85 కోట్లు మేర రాయితీపై రుణాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు వ్యవసాయశాఖ జేడీ మోహన్‌రావు వెల్లడించారు. బుధవారం ఆయన మన్యపురట్ల, నాతవరం గ్రామాల్లో పర్యటించారు. సాగులో ఉన్న అరుతడి పంటల ఈకేవైసీ నమోదును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతులతో స్వయంగా మాట్లాడి, వారి సందేహాలను నివృత్తి చేశారు. సిబ్బందికి పలు సూచనలందించారు. తర్వాత నాతవరం ఆర్‌బీకేలో మండల స్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 24 మండలాల్లో రైతు సంఘాల గ్రూపులు 179 ఉన్నాయన్నారు. ఆయా గ్రూపులకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం రుణాల మంజూరు ప్రక్రియ జరుగుతుందన్నారు. ఒక్కో గ్రూపునకు నిబంధనల మేరకు రూ.15 లక్షలు చొప్పున రుణం ఇస్తామని, ఇందులో ప్రభుత్వ రాయితీ 40 శాతం, లబ్ధిదారుల వాటా 10 శాతం, మిగిలిన 50 శాతం బ్యాంకు(డీసీసీబీ), అప్కాబ్ ద్వారా రుణంగా అందించనున్నట్టు పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్నిచ్చే వ్యవసాయ పంటల సాగుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

80 వేల ఎకరాలలో వివిధ పంటల సాగు

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా దాదాపు 80 వేల ఎకరాలలో వివిధ రకాలు పంటల్ని రైతులు సాగు చేస్తున్నట్టు వెల్లడించారు. వాటిలో 37 వేలు ఎకరాల్లో సాగవుతున్న ఆరుతడి పంటలకు మాత్రమే ఈకేవైసీ నమోదు చేస్తున్నట్టు చెప్పారు. అరుతడి పంటల్లో అధికంగా మినప, పెసర, వేరుశనగ, ఉలవలు, పచ్చిరొట్ట, పొద్దు తిరుగుడు వంటివి సాగవుతున్నట్టు తెలిపారు. జిల్లాలో రబీలో వరి పంట సాగు 6 వేల ఎకరాలు లక్ష్యం కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు సేకరించిన లెక్కల మేరకు కేవలం 1500 ఎకరాలేనన్నారు. చెరకు సుమారు 32 వేల ఎకరాల్లో సాగవుతుండగా, ఇంకా ఈకేవైసీ నమోదు ప్రక్రియ పూర్తికాలేదన్నారు. ఈకేవైసీ గడువును ఈ నెల 25 వరకు పెంచినట్టు తెలిపారు. బయోమెట్రిక్ విధానంపై రైతులకు అవగాహన కల్పించి, ఈకేవైసీ తుది జాబితాను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచనున్నట్టు పేర్కొన్నారు. పొరపాట్లు సరిచేసేందుకు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సిబ్బంది సహకరిస్తారని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యంలో ఆర్‌బీకేల ద్వారా నేటి వరకు 26 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. జిల్లాలో 450 ఆర్‌బీకేలుండగా, 40 కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణం పూర్తయిందన్నారు. సొంత భవనాలు పూర్తి చేసుకున్న ఆర్‌బీకేల ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

లాభాల 'సిరి' ధాన్యాలు

- మిల్లెట్స్ వంటకాల్లో మహిళలకు శిక్షణ
- సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు చేయూత
- ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా రుణసౌకర్యం



చిరుధాన్యాలతో తయారు చేసిన బిస్కెట్లను పరిశీలిస్తున్న ఏడీఆర్ జగన్నాథరావు



బెల్లం పొడి ప్యాకెట్



కొర్రలతో ఉప్మా మిక్స్

అనకాపల్లి టౌన్: నిజంగా అవి సిరి ధాన్యాలే..! ఆరోగ్య భాగ్యంతోపాటు లాభాల సిరి అందిస్తున్న చిరుధాన్యాలపై ఇప్పుడు అందరి దృష్టి పడింది. కొర్రలు, అరికెలు, సామలు, రాగులు వంటి బలవర్థక చిరు ధాన్యాలు (మిల్లెట్స్) సత్ఫలితాలను ఇస్తున్నాయి. వాటితో ఎన్నో రుచికరమైన వంటలు తయారు చేస్తున్నారు. ఇప్పుడు ఆ వంటల తయారీ లాభసాటి వ్యాపారంగా ఎదిగే స్థాయికి చేరింది. అందుకే స్థానిక ఆర్ఏఆర్ఎస్ ఆవరణలోని చిరుధాన్యాల కార్యాలయంలో రెండు రోజులపాటు వంటల తయారీలో శిక్షణ ఇచ్చారు. బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు మాట్లాడుతూ.. నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా రుణ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. చిరుధాన్యాలతో బెల్లం బిస్కెట్స్, కేక్స్, మఫిన్స్, చెరకురసం జెల్లీస్, దోస మిక్స్, ఉప్మా తదితర వంటకాల తయారీలో శిక్షణ ఇచ్చారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోద్బలంతో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు పరిశ్రమను బట్టి ఒక వ్యక్తికి రూ.10 లక్షల వరకు, గ్రూప్‌కు రూ.కోటి వరకు బ్యాంకుల ద్వారా వ్యాపారానికి రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమ ఏర్పాటు చేసి మూడు, నాలుగు సంవత్సరాలు వ్యాపార లావాదేవీలు చేసినట్లయితే రుణమొత్తంలో 30 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, చిత్తూరు జిల్లాల నుంచి వచ్చే నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రతి గ్రూప్‌లో 20మంది సభ్యులుంటారని, చిరుధాన్యాల వంటకాలపై వారికి అవగాహన కల్పించి, తయారు చేయడంలో శిక్షణ ఇస్తారని ఆయన చెప్పారు. మన జిల్లా నుంచి 8 బ్యాచ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, మొదటి బ్యాచ్‌లో అనకాపల్లి నియోజకవర్గంలో తుమ్మపాల, రాజుపాలెం ప్రాంతాలకు చెందిన షెడ్యూల్ కులాల వారికి శిక్షణ ఇచ్చి సబ్‌ప్లాన్ ద్వారా నిధులు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. తుమ్మపాల ఎస్‌వీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ, శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

శిక్షణ ఎంతో బాగుంది



రెండు రోజుల శిక్షణలో చిరుధాన్యాలతో వంటకాలు తయారు చేసే పద్ధతులను వివరించడంతోపాటు, తయారు చేసి చూపించడం మాకెంతో ఉపయోగపడింది. అరిసెలు, బూరెలు, కొర్రలతో ఉప్మా వంటి వంటకాలు స్వయంగా తయారు చేయడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. మా గ్రామంలో వంటకాలు తయారు చేసి అమ్మకాలు సాగిస్తాను.

–భాగ్యలక్ష్మి, ఊడేరు గ్రామం, అనకాపల్లి మండలం

చిరుధాన్యాల వంటకాలకు మంచి గిరాకీ



బవులవాడ గ్రామంలో చిరుధాన్యాల వంటకాల వ్యాపారాన్ని రెండేళ్ల క్రితం ప్రారంభించాను. ప్రభుత్వం నుంచి రెండు మాసాల క్రితం రూ.6 లక్షల 50 వేల రుణం తీసుకున్నాను. వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేస్తాను. విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. ఎనిమిదిమంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలబడ్డాను.

–సిద్దిరెడ్డి రాజ్యలక్ష్మి, శిక్షకురాలు, బవులవాడ

లోవ తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ



ఆలయంలో బారికేడ్లు, రక్షణ ఏర్పాట్లు పరిశీలిస్తున్న గౌతమి సాలి

రావికమతం: ఈ నెల 18 నుంచి 3 రోజుల పాటు జరిగే కళ్యాణపులోవ తిరునాళ్లకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా ఎస్పీ గౌతమి సాలి బుధవారం పరిశీలించారు. ఆ మూడు రోజుల్లో లక్షల సంఖ్యలో యాత్రికులు వస్తారు. ఆర్టీసీ 80 వరకూ ప్రత్యేక సర్వీసులు నడపనున్న దృష్ట్యా తగిన ట్రాఫిక్ ఏర్పాట్లు, రక్షణ ఏర్పాట్లు గూర్చి ఎండోమెంటు అధికారులు, ఆలయ ట్రస్టు బోర్డు, స్థానిక ప్రజా ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాలు జరుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తిరునాళ్ల విజయవంతం చేయాలన్నారు. అడుగడుగునా బందోబస్తు ఉంచాలని స్థానిక సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్‌ను ఆమె ఆదేశించారు.

పారదర్శకంగా సెపక్ తక్రా క్రీడాకారుల ఎంపిక

- అంతర జిల్లా పోటీలకు 20 మంది క్రీడాకారుల ఎంపిక
- 19 నుండి 21 వరకు అనంతపురం జిల్లాలో పోటీలు



సెపక్ తక్రా ఉమ్మడి విశాఖ జట్ల క్రీడాకారులతో ఉపాధ్యాయులు, పీడీలు

దేవరాపల్లి: ఉమ్మడి విశాఖపట్నం స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెపక్ తక్రా జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ మండలంలోని పెదనందిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పారదర్శకంగా జరిగింది. ఈ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను స్థానిక పేరెంట్స్ కమిటీ చైర్మన్ సిహెచ్.అప్పలనాయుడు, స్థానిక హైస్కూల్ హెచ్ఎం పి. శ్రీనివాసరావు అనకాపల్లి జిల్లా స్కూల్ గేమ్స్(ఎస్‌జీఎఫ్) సెక్రటరీ ఎ. శేఖర్, జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం సెక్రటరీ బి.కిరణ్‌కుమార్, స్థానిక వ్యాయమ ఉపాధ్యాయులు టి.నాగేశ్వరరావు, ఎస్. గోవింద, రావూస్ అకాడమి డైరెక్టర్ అప్పారావు తదితర్లు ప్రారంభించారు. ఈ ఎంపికకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుండి 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో అండర్-14, అండర్-17 విభాగాలలో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జట్టుకు ఐదుగురు చొప్పున రెండు విభాగాలలో 20 బాలబాలికలను ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపిక చేసిన క్రీడాకారులు ఈ నెల 19 నుండి 21 వరకు అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం అమిద్యాల జెడ్పీ హైస్కూల్లో జరిగే అంతర జిల్లా సెపక్ తక్రా పోటీలలో పాల్గొంటారన్నారు. అనంతరం స్థానిక హెచ్ఎం పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఇటువంటి క్రీడాకారుల ఎంపిక చేపట్టడం ద్వారా విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి, ఉత్సాహం పెరుగుతుందన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

- భారీ సెట్టింగ్‌లతో 'సురభి' నాటకాలు
- ఉత్సవాలను ప్రారంభించనున్న ప్రముఖ హాస్యనటుడు అలీ
- నేడు గౌరీశ్వరస్వామివారి కల్యాణం, తిరువీధోత్సవం



విద్యుత్ కాంతుల్లో గౌరీశ్వర ఆలయం



పూజలందుకుంటున్న స్వయంభూ గౌరీశ్వరస్వామి

చోడవరం: స్వయంభూ గౌరీశ్వరస్వామి కల్యాణ మహాశివరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. మాఘమాసంలో శ్రీ గౌరీశ్వరస్వామి కల్యాణం ఏటా జరుపుతారు. ఈ ఉత్సవాలను ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు జరిపేందుకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సినీ, నాటక రంగ ప్రముఖులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలు ఘనంగా జరపడానికి ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సత్తిబాబు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలతో స్వామివారి కల్యాణోత్సవ వేడుకలు ప్రారంభమౌతాయి. మెయిన్‌రోడ్డు నుంచి ఆలయం వరకు దారిపొడవునా విద్యుత్ అలంకరణ చేశారు. గురువారం రాత్రి స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. మధ్యాహ్నం గౌరీవరమేశ్వరుల ఉత్సవ మూర్తులకు తిరువీధోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రముఖ సినీ హాస్యనటుడు అలీ వస్తున్నారు. గురువారం సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభిస్తారు.

ఆరు రోజుల పాటు అలరించనున్న 'సురభి' నాటకాలు

చాలా ఏళ్ల తర్వాత మరలా చోడవరంలో ప్రఖ్యాత నాటక పరిషత్ 'సురభి' నాటకాలు ప్రదర్శనకు సిద్ధమయ్యాయి. భారీ సెట్టింగ్‌తో సినిమాలను తలపించే విధంగా ప్రదర్శించే ఈ నాటకాలు చూసేందుకు జనం చాలా ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. కల్యాణోత్సవాల ప్రారంభం రోజైన గురువారం రాత్రి 9గంటలకు భక్త ప్రహ్లాద నాటకంతో సురభి నాటకాలు ప్రారంభమై ఆరు రోజుల పాటు రోజుకో నాటకం చొప్పున, మహాశివరాత్రి రోజున రెండు నాటకాలు ప్రదర్శిస్తారు. 17న బాలనాగమ్మ, 18న శివరాత్రి సందర్భంగా పాతాలభైరవి, భూకైలాస్ నాటకాలు ప్రదర్శిస్తారు. 19న శ్రీకృష్ణ లీలలు, 20న వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర, 21న ఉత్సవాలు ముగింపు సందర్భంగా మాయాబజార్ నాటకాలను ప్రదర్శిస్తారు.



పూలమాలలతో గౌరీశ్వరుడికి అలంకారం

భారీ సినీ సెట్టింగ్‌లతో జరిగే ఈ నాటకాలు ప్రదర్శనలకు శివాలయం ప్రాంగణంలో ఉన్న గౌరీశ్వర స్వామి కళావేదికను సిద్ధం చేశారు.

ఎంపీ దృష్టికి నిర్వాసితుల సమస్యలు



ఎంపీ సత్యవతిని కలిసిన మత్స్యకారులు, ఎన్‌ఏఓబీ నిర్వాసితులు

తుమ్మపాల: రాంబిల్లి మండలం మత్స్యకారులు, ఎన్ఏఓబీ నిర్వాసితుల సమస్యలను జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే కన్నబాబురాజు సమన్వయంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు ఎంపీ బి.వి.సత్యవతి తెలిపారు. ఎన్ఏఓబీ నిర్మాణ పనుల కారణంగా నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంటులో ప్రస్తావించామని, దేశ రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దృష్టికి కూడా తీసుకెళ్లామని ఆమె తెలిపారు. నిర్వాసితులు బుధవారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి మరోసారి సమస్యలు వివరించారు. రాంబిల్లి ఎంపీటీసీ చింతకాయల పెంటయ్య, మాజీ ఎంపీటీసీలు కొవిరి రామకృష్ణ, సీహెచ్.వెంకటేశ్వరరావు, దేముడు, కె.సన్యాసిరావు, ఉపసర్పంచ్ డి.నూకరాజు పాల్గొన్నారు.

బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుల నియామకం



అధ్యాపకులు ఎస్ఎంఎస్ కుమార్, నారాయణ, గజపతిరాజు

పాయకరావుపేట: ఆంధ్ర యూనివర్సిటీ కంప్యూటర్స్ డిపార్ట్‌మెంట్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యులుగా స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల కంప్యూటర్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు ఎస్.ఎం.ఎస్.కుమార్, ఏఆర్‌వీఎల్ నారాయణ, పి.ఎస్.గజపతిరాజు నియమితులైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు తెలియజేశారు. వీరు 2023 నుండి 2026 వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యులుగా కొనసాగుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని కళాశాల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, అధ్యాపకులు అభినందించారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరిస్తాం



విద్యార్థులతో మాట్లాడుతున్న మహిళా కమిషన్ సభ్యురాలు ఉమ, ఆర్‌జేడీ జ్యోతికుమారి

ఎస్.రాయవరం: లింగరాజుపాలెంలో మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే పాఠశాలలో విద్యార్థుల సమస్యల పరిశీలనకు బుధవారం సాయంత్రం మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ, ఆర్‌జేడీ జ్యోతికుమారి, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీపతి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్యామ్, ఎంఈవో మూర్తి, ఉపవిద్యాశాఖాధికారి ఒకరి తరువాత ఒకరు పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఇబ్బందులు వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా సమాచారం తెలియడంతో అధికారులు పరుగు పెట్టారు. ఈ మేరకు గెడ్డం ఉమ విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థులు ఉన్న తాత్కాలిక భవనం తుఫాన్ రక్షిత భవనమని, పూర్తి స్థాయిలో భవనం లేక ఇబ్బందులు తప్పడం లేదన్నారు. రాష్ట్ర కమిషనర్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి త్వరలో అన్ని సదుపాయాలు ఉన్న భవనంలోనికి విద్యార్థులను మార్చేలా చేస్తామన్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల సమస్యను పరిష్కారం చేశారని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్యామ్ అన్నారు. శాశ్వత భవనం నిర్మాణానికి స్థల కేటాయింపుపై దృష్టి సారిస్తామన్నారు.

యువకుని హత్య కేసులో నిందితుడి లొంగుబాటు

వివరాలు వెల్లడించిన సీఐ



విలేకరులకు నిందితుడి వివరాలు తెలుపుతున్న సీఐ నారాయణరావు

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు మద్యం దుకాణం వద్ద రెండు రోజుల క్రితం యువకుడు ప్రవీణ్‌కుమార్‌ను హత్య చేసిన నిందితుడు చొప్పా రమణ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడని నక్కపల్లి సీఐ నారాయణరావు బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. మృతుడి తల్లి దంటు సత్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, తాము చేసిన విచారణలో పలు విషయాలు తెలిశాయన్నారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు చొప్పా రమణ, హత్యకు గురైన ప్రవీణ్‌కుమార్ కొంతకాలంగా కొరుప్రోలు కొబ్బరి పీచు ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రవీణ్‌కుమార్ చొప్పా రమణ కుమార్తెను ప్రేమిస్తున్నానని వెంటపడేవాడు. ఈ విషయం తెలిసి చొప్పా రమణ ప్రవీణ్‌కుమార్‌ను తీవ్రంగా హెచ్చరించాడు. ఈ నేపథ్యంలో రమణకు వేరే మహిళతో అక్రమ సంబంధం ఉన్నట్టు రమణ భార్యకు ప్రవీణ్‌కుమార్ చెప్పాడు. దీంతో కక్ష పెంచుకున్న రమణ తన కూతురి జీవితంతో పాటు తన కాపురంలోనూ చిచ్చుపెట్టిన ప్రవీణ్‌కుమార్‌ను అంతమొందించాలని నిర్ణయించుకుని సోమవారం రాత్రి పెదగుమ్ములూరు మద్యం దుకాణం వద్ద పథకం ప్రకారం కాపు కాశాడు. తనతో తెచ్చుకున్న కత్తితో విచక్షణా రహితంగా ప్రవీణ్‌కుమార్‌ను నరికి చంపి పారిపోయాడు. నిందితుడు లొంగిపోయి నేరాన్ని అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు సీఐ చెప్పారు.

జీవీఎంసీ కమిషనర్‌తో వాటర్ కమిషన్ సభ్యుల భేటీ



కమిషన్ సభ్యులతో మాట్లాడుతున్న కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీలో చేపడుతున్న తాగునీరు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, మురుగునీటి శుద్ధి తదితర వాటి పని తీరును పరిశీలించేందుకు నగరానికి వచ్చిన సెంట్రల్ వాటర్ కమిషన్ బృందం బుధవారం జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ, మురుగునీటి శుద్ధి చేసే విధానాన్ని కమిషనర్ వారికి వివరించారు. అనంతరం కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సింహాద్రి ప్రసాద్, శాస్త్రవేత్త నీలిమా పాటి మాట్లాడుతూ నగరంలో ప్రతి ప్రాంతానికి వెళ్లి ప్లాంట్ల నిర్వహణ ఏ విధంగా అమలు చేస్తున్నారో పరిశీలిస్తామన్నారు. ఈ సమావేశంలో పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎస్ రవి, కార్యనిర్వాహక ఇంజినీర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న వినయ్ ఆచారి

బీచ్‌రోడ్డు: చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తున్నామని కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ డీజీఎం సీహెచ్ వినయ్ ఆచారి అన్నారు. సిరిపురంలోని కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన అనేక పథకాల్లో భాగస్వామ్యం వహించినట్లు చెప్పారు. ఖాతాదారులకు ఎదురైన సమస్యలు, వాటి పరిష్కారాలను వివరించారు. డీపీసీ జీఎం సీహెచ్ గణపతి, ఏజీఎం జి.వి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

600 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



బెల్లం పులుపును పారబోస్తున్న ఎస్ఐ రామకృష్ణ

కె.కోటపాడు: గవరపాలెం గ్రామంలో నాటుసారా తయారీ కేంద్రాలపై ఎ.కోడూరు పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. సారా తయారీ జరుగుతుందన్న ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలను నిర్వహించారు. గ్రామానికి చెందిన శివారు ప్రాంతంలో నాటుసారా తయారీకి డ్రమ్ములలో సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లంపులుపును గుర్తించారు. ఈ పులుపును సిబ్బందితో కలిసి ఎస్ఐ రామకృష్ణ ధ్వంసం చేశారు. నాటుసారా తయారీ చట్టరీత్యా నేరమని, సారా తయారీకి పాల్పడితే చట్టపరమైన చర్యలను తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఆయన వెంట కానిస్టేబుల్ మూర్తి పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు అప్పలనాయుడు మృతి



అప్పలనాయుడు (ఫైల్)

మునగపాక: మండలంలోని చూచుకొండ గ్రామంలో శతాధిక వృద్ధుడు పెంటకోట అప్పలనాయుడు(101) బుధవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అప్పలనాయుడు మృతిచెందడంతో గ్రామంలో విషాదం అలముకుంది. అప్పలనాయుడుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అప్పలనాయుడు అంత్యక్రియలు స్వగ్రామం చూచుకొండలో నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో కలలు సాకారం

సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత యండమూరి



యండమూరిని సత్కరిస్తున్న స్కూల్ సిబ్బంది

కశింకోట: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో తమ లక్ష్యాలను సాధించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ప్రముఖ నవలా రచయిత, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత యండమూరి వీరేంద్రనాథ్ సూచించారు. స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో 'విజయ మార్గానికి సోపానాలు' అనే అంశంపై విద్యార్థులకు బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు భయాన్ని వీడి, ధైర్యంతో విజయ లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల్లో ఆలోచనా విధానాన్ని పెంపొందించే విధంగా పలు ప్రశ్నలు అడిగి ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా పాఠశాల తరపున యండమూరికి దుశ్శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

- మరో నలుగురికి గాయాలు
- నరసింగిబిల్లి వద్ద ఘటన



దినేష్ మృతదేహం



రోడ్డు పక్క కాలువపైకి దూసుకుపోయిన ఆటో

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ డిప్లమో విద్యార్థి దుర్మరణం చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. కశింకోట ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి అందించిన వివరాల ప్రకారం..యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వేగంగా వస్తున్న ఆటో నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రోడ్డు పక్కన నిలుచుని ఉన్న విద్యార్థులను ఢీకొని వెళ్లి పక్కనున్న కాలువపైకి దూసుకుపోయి ఆగింది. ఈ ప్రమాదంలో రోలుగుంట మండలం నందికొండ గ్రామానికి చెందిన జిల్లెడిపూడి దినేష్ (18) అనే విద్యార్థి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కశింకోటకు చెందిన కాకర మహాలక్ష్మి, నర్సీపట్నం మండలం వేములపూడికి చెందిన గవిరెడ్డి వేమనాయుడు అనే విద్యార్థులతో పాటు ఆటో డ్రైవర్, ఆటోలో ప్రయాణికుడు గాయపడ్డారు. మాకవరపాలెం వద్ద అవంతి కళాశాలలో ఈఈఈ చదువుతున్న విద్యార్థులు నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. ఇంటర్న్ షిప్ ముగిసిన తర్వాత తమ గ్రామాలకు వెళ్లడానికి ఆటో కోసం రోడ్డు పక్క నిలచొని ఉండగా ఈ ప్రమాదం జరిగింది. దినేష్ మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టానికి తరలించారు. గాయపడిన విద్యార్థులను విశాఖ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి తెలిపారు.



గాయపడిన కాకర మహాలక్ష్మి, గవిరెడ్డి వేమనాయుడు

క్లుప్తంగా

అభయాంజనేయస్వామి వార్షికోత్సవం నేడు



జి.భీమవరం అభయాంజనేయస్వామి

కశింకోట : మండలంలోని జి.భీమవరం గ్రామంలో అభయాంజనేయస్వామి వార్షికోత్సవం గురువారం ఘనంగా జరగనుంది. ఈ మేరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఉందని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీలో స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు

కశింకోట : స్వయం సహాయక సంఘాల వీవోల ద్వారా ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన విత్తనాలను రైతులకు విక్రయించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని అచ్చెర్ల, మోసయ్యపేట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై స్వయం సహాయక సంఘాల రైతులకు అవగాహన కల్పిస్తూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ ధాన్యాలు, 30 రకాల చిరు ధాన్యాల విత్తనాలను ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసేందుకు అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వీవో సత్యనారాయణ, వీవోఏ నాగమణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బందిపాల్గొన్నారు.

18న మహా శివరాత్రి ప్రత్యేక పూజలు

అనకాపల్లిటౌన్ : ఈ నెల 18న మహా శివరాత్రిని పురస్కరించుకుని స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో ఉదయం 6 గంటల నుంచి నగరేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు రుద్రాభిషేకం చేయనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలు వంటి సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 8,508 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,710	4,150
మొదటి రకం	3,370	3,690
రెండో రకం	3,100	3,490
మూడో రకం	2,910	3,090

అనకాపల్లి సినిమాలు

పాప్‌కార్న్	- రాజా
వేద	-సత్యనారాయణ స్క్రీన్-1
అమిగోస్	-సత్యనారాయణ స్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
పఠాన్	-పర్తిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
చడ్డీగ్యాంగ్ (ఉదయం, మధ్యాహ్నం)	- శ్రీసత్య
వారసుడు (ఫస్ట్ షో, సెకండ్ షో)	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 108 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు , బీ పాజిటివ్-54 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-42 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్ -2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 461 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 434 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

నాడు దైన్యం.. నేడు ఘనం

ప్రభుత్వ పాఠశాలలు.. అరకొర గదులు.. ఆరుబయట చదువులు.. విద్యుత్ సౌకర్యం మాట దేవుడెరుగు.. కనీసం తాగునీరైనా లేని పరిస్థితులు.. ఇదంతా గతం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చా సర్కారీ స్కూళ్ల రూపురేఖలు సమూలంగా మార్చేశారు. అత్యాధునిక భవనాలు, పిల్లలు కూర్చునేందుకు సౌకర్యవంతమైన బెంచీలు, ఫ్యాన్లు, మినరల్‌వాటర్, డిజిటల్ బోధన, స్టార్ హోటళ్లను తలపించే మరుగుదొడ్లు.. ఒకటేమిటి.. మధ్యతరగతి వారు కూడా తమ ఇళ్లల్లో ఏర్పాటు చేసుకోలేనన్ని వసతులు. మనబడి నాడునేడులో భాగంగా మండలంలోని ప్రభుత్వ స్కూళ్లు ఎంతగానో అభివృద్ధి చెంది.. ఔరా అనిపిస్తున్నాయి.



నాడు-నేడు మొదటి దశలో పూర్తయిన గురజాడనగర్ పాఠశాల



భీమునిగుమ్మం పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు

- శరవేగంగా మనబడి నాడు-నేడు పనులు
- రెండు విడతల్లో రూ.26.41 కోట్లు కేటాయింపు
- నూతన హంగులతో అదనపు భవనాలు

తుమ్మపాల : మనబడి నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. నూతన భవనాలతో పాటు అన్ని మౌలిక సౌకర్యాలు పాఠశాలలకు సమకూరుతున్నాయి. ఇప్పటికే మొదటి దశ పనులు పూర్తయిన పాఠశాలల్లో అధునాతన విధానంలో బోధన జరుగుతోంది. ప్రస్తుతం రెండవ దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పాఠశాల విద్యను బలోపేతం చేసి పిల్లల భవిష్యత్‌కు భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు ద్వారా సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు మొదటి దశలో పూర్తయిన పాఠశాలల్లో డిజిటల్ తరగతుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నారు.

ప్రైవేట్ స్కూళ్లను తలదన్నేలా

మండలంలో రేబాక పంచాయతీ గురజాడనగర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థలో ఉండేది. కొండప్రాంతం కావడంతో మంచినీటి కొరత వేధించేది. తరగతి గదుల నుంచి బయటకు వెళ్లి ఆడుకోవాలంటే కంకర రాళ్లు దర్శనమిచ్చేవి. పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా తొలి దశలో ఈ పాఠశాలను ఎంపిక చేసి రూ.11.86 లక్షలతో పనులు పూర్తిచేశారు. అదనపు గదులు నిర్మించి తరగతి గదుల సంఖ్య పెంచారు. మంచినీటి సౌకర్యంతో పాటు మధ్యాహ్న భోజనానికి ప్రత్యేక షెడ్డు, మరుగుదొడ్లు నిర్మించారు. నూతన హంగులతో పాఠశాలను తయారుచేశారు. దీంతో ప్రైవేటు పాఠశాలల్ని తలదన్నేలా ఈ పాఠశాల కనిపిస్తోంది.

తొలి విడతలో రూ.11.21 కోట్లు

పట్టణం, మండల పరిధిలో మొదటి విడతలో 42 పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తిచేశారు. రూ.47.11 లక్షలతో మున్సిపల్ హైస్కూల్, రూ.51.73 లక్షలతో గవరపాలెం హైస్కూల్, రూ.66.38 లక్షలతో టౌన్ బాలికల పాఠశాల, రూ.68.62 లక్షలతో గాంధీనగరం పాఠశాల, రూ.56.69 లక్షలతో తుమ్మపాల జెడ్పీ హైస్కూల్, రూ.60.76 లక్షలతో సీతానగరం స్కూల్, రూ.57.63 లక్షలతో మామిడిపాలెం, రూ.40.98 లక్షలతో కూండ్రం, రూ.53.37 లక్షల నిధులతో కొప్పాక పాఠశాలను ఆధునికీకరించారు. మిగిలిన ఉన్నత, ప్రాథమిక పాఠశాలకు ఒక్కో పాఠశాలకు కనీసం రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వెచ్చించి, అవసరమైన సౌకర్యాలను కల్పించారు.

రెండో విడతలో రూ.15.20 కోట్లు

రెండో విడతలో 43 పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. మండలంలోని కొండుపాలెం జెడ్పీ హైస్కూల్ అభివృద్ధికి రూ.1.60 కోట్లు, తారకరామ కాలనీలో హైస్కూల్‌కు రూ.1.52 కోట్లు, తుమ్మపాల పాఠశాలకు రూ.1.02 కోట్లు, మార్టూరు పాఠశాలకు రూ.కోటి, మర్రిపాలెం పాఠశాలకు రూ.68.9 లక్షలు, మామిడిపాలెం పాఠశాలకు రూ.54.96 లక్షలు, కొప్పాక రూ.58.99 లక్షలు, దిబ్బపాలెం రూ.66.35 లక్షలు, సీహెచ్‌ఎన్ అగ్రహారం రూ.65.99 లక్షలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మిగిలిన పాఠశాలకు రూ.50 లక్షల లోపు నిధుల కేటాయింపులు చేశారు. ప్రస్తుతం మండలంలో ప్రతిపాదించిన అన్ని పాఠశాలల్లోను నాడు-నేడు పనులు ఊపందుకున్నాయి.

శరవేగంగా పనులు



మనబడి నాడు-నేడు రెండవ దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండవ దశలో జీవీఎంసీ, మండల పరిధిలోని 43 పాఠశాలల్లో పనులు చేస్తున్నారు. ఈ విడతలో ఎక్కువ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చాం. పూర్తయిన పాఠశాలల్లో డిజిటల్ తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– డి.దివాకర్, ఎంఈవో, అనకాపల్లి

బస్టాపుల్లో రాత్రిపూట బస్సుల్ని నిలపాలి



ఆర్టీసీ డిపో ట్రాఫిక్ మేనేజర్ రవిచంద్రకు వినతి పత్రం అందిస్తున్న కొణతాల వెంకటఅప్పారావు

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి-విశాఖ రూట్‌లో తిరిగే 500 నంబర్ బస్‌లను బస్‌స్టాప్‌లలో ఆపి, ప్రయాణికులను ఎక్కించుకోవాలని గవరపాలేనికి చెందిన వ్యాపారవేత్త కొణతాల వెంకటఅప్పారావు కోరారు. ఈ మేరకు స్థానిక ట్రాఫిక్ మేనేజర్ రవీంద్రకు బుధవారం వినతిప్రతం అందించారు. వివిధ పనుల కోసం రోజూ వందల మంది అనకాపల్లి నుంచి విశాఖకు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. మంగళవారం రాత్రి విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ వద్ద గంటపాటు నిరీక్షించినా ఒక్క బస్సూ రాలేదన్నారు. రాత్రి 9 గంటల సమయంలో ఒకేసారి మూడు బస్సులు వచ్చాయని, ప్రయాణికులున్నా.. ఆపకుండా వెళ్లిపోయారని ఆరోపించారు. విశాఖ నుంచి అనకాపల్లి వచ్చే బస్‌డ్రైవర్లకు బస్‌స్టాఫ్‌లో బస్‌లు ఆపి ప్రయాణీకులను ఎక్కించుకునేలా ఆదేశాలు జారీ చేయాలని తన వినతిపత్రంలో పేర్కొన్నారు.

తారు రోడ్డు పునరుద్ధరణ



కశింకోటలో ప్రధాన రహదారిపై కొత్తగా వేస్తున్న తారు రోడ్డు

కశింకోట : కశింకోటలోని పంచాయతీ ప్రధాన రహదారిపై తారు రోడ్డు పునర్నిర్మాణ పనుల్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక జాతీయ రహదారి నుంచి మస్జిద్ వరకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమకూర్చిన నిధులతో రహదారిని విస్తరించారు. ఇపుడు తారు రోడ్డు వేస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో ఈ రహదారిని విస్తరించి, తారు రోడ్డు వేశారు. మళ్లీ ఇప్పుడు ఆయన తనయుడు సీఎం జగన్ హయాంలో పునర్నిర్మిస్తుండటం విశేషం. ఈ పనులను వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు పరిశీలించారు.

నేడు మరిడిమాంబ జాతర



మరిడిమాంబ అమ్మవారు, అనకాపల్లి-చోడవరం రహదారిలో విద్యుత్ తోరణాలు

అనకాపల్లిటౌన్ : స్థానిక విజయరామరాజుపేట మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆ రోజు ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగనున్నాయి. అమ్మవారి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశాలుండటంతో ముందస్తు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. తెల్లవారుజామున నగర సంకీర్తన, 9 గంటలకు భక్తిసుధ భక్తిగీతాలాపన, సాయంత్రం కనులు మిరుమిట్లు గొల్పే విద్యుత్‌కాంతుల నడుమ కోలాటాలు, పులివేషాలు, చిటికెల భజనలు తదితర కార్యక్రమాలు ప్రజల్ని ఆకట్టుకుంటాయన్నారు. రాత్రి 7 గంటల నుంచి ఆర్కెస్ట్రా, డ్యాన్ బేబీ డ్యాన్స్, డూప్స్ బాబోయ్ డూప్స్, సారంగధర చౌచౌ, కొండకొప్పాక వారిచే బాణసంచా విన్యాసాలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

ఆక్రమణలపై రెవెన్యూ శాఖ ఉక్కుపాదం

- ఆటోలతో ప్రచారం చేస్తున్న రెవెన్యూ యంత్రాంగం



మారేడుపూడి సర్వే నెం.357లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

అనకాపల్లిటౌన్ : మండలంలో మారేడుపూడి గ్రామం సర్వే నెం.357లో భూముల ఆక్రమణలు పెచ్చుమీరుతున్న సమయంలో రెవెన్యూ అధికారులు వరుసగా దాడులు నిర్వహిస్తూ ఉక్కుపాదం మోపుతున్నారు. ఒక పక్క ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు దాడులు, మరో పక్క ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు పాతి అక్రమార్కులకు హెచ్చరికల జారీ చేస్తున్నారు. నిబంధనలను మీరి, ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్న వారిని హడలెత్తిస్తున్నారు. ఆక్రమణదారులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా, అన్యాక్రాంతం చేసినా అటువంటివారిపై ఐపీసీ 183, 189, 196 సెక్షన్ల ద్వారా కేసులు నమోదు చేస్తామంటూ ఆటో ద్వారా ప్రచారానికి తహసీల్దార్ గంగాధరరావు శ్రీకారం చుట్టారు. ఈ ఆటో మండలంలోని పలు గ్రామాల్లో తిరుగుతూ జనసంచారం ఎక్కువగా ఉన్న చోట ప్రచారం చేస్తోంది. ఈ విషయంపై తహసీల్దార్ గంగాధరరావు సాక్షితో మాట్లాడుతూ మండలంతోపాటు, పట్టణమంతా తమ సిబ్బందితో వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ డ్రైవ్‌లో ఎక్కడైనా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు కనిపిస్తే రెవెన్యూ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాటర్ ట్యాంకు కూల్చివేతకు చర్యలు



శిథిలావస్థకు చేరుకున్న వాటర్‌ట్యాంకును తొలగిస్తున్న కూలీలు

అనకాపల్లిటౌన్ : వేల్పులవీధి సర్వకామదాంబ పార్కు వద్ద 1962లో నిర్మించిన 1000 కిలో లీటర్ల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో పక్కన అదే సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మించి పట్టణ ప్రజలకు తాగునీటిని అందిస్తున్నారు. అయితే ప్రమాదకర స్థితిలో ఉన్న పాత ట్యాంకును కూల్చివేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు జీవీఎంసీ నీటిపారుదల శాఖ ఏఈ కేదార్‌నాథ్ బుధవారం పేర్కొన్నారు. కాస్త ఆలస్యమైనా పరిసర ప్రాంత జనావాసాలకు నష్టం వాటిల్లకుండా కూలీల సాయంతో కూల్చివేత పనులు చేపడుతున్నట్టు తెలిపారు.

జనసేన రెల్లి సమితి సమావేశం

అనకాపలి రూరల్ : మండలంలోని తుమ్మపాల గ్రామంలో జనసేన రెల్లి సమితి రాష్ట్ర సమావేశం జరిగింది. దీనికి రాష్ట్ర రెల్లి కమిటీ సభ్యులు కోన అప్పారావు, కోన దుర్గేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెల్లి కులస్తులు చట్టసభల్లో అడుగు పెట్టాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రోత్సహిస్తున్నారని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. రెల్లి కులస్తులంతా ఐక్యంగా ఉండాలన్నారు. సమావేశంలో రాష్ట్ర రెల్లి సమితి ప్రతినిధులు సోమి ఉదయ్‌కుమార్, సోమి శంకరరావు, రాఘవేంద్ర, హరియాల సురేష్, యర్రంశెట్టి సురేష్, బండి సురేంద్ర, కోన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'రేషన్ బియ్యం రెండింతలు ఇవ్వాలి'



ఆర్డీవో కార్యాలయంలో డీటీ జయశ్రీకి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

తుమ్మపాల : ప్రతి నెలా రెండు కోటాల రేషన్ బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు తాకాసి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు, కె.శంకరరావు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కరోనా కాలం నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా ఇస్తున్న బియ్యంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ వాటా నిలిపివేయడం అన్యాయమన్నారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉచితంగా పేదలకు బియ్యం పంపిణీ చేయాలన్నారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయినందున కనీసం బియ్యాన్ని ఉచితంగా ఇస్తే పేదలకు పొట్ట నింపవచ్చన్నారు. అంతకుముందు ఆర్డీవో కార్యాలయలో డీటీ జయశ్రీకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎం.సత్యనారాయణ, చిన్ని, ముత్యర్తి సూరిబాబు, జీవీ రావు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తరలించాలని ధర్నా



డంపింగ్ యార్డు వద్ద ధర్నా చేస్తున్న వీరుయాదవ్

అనకాపల్లిటౌన్ : జిల్లా నడిబొడ్డున, గృహాల మధ్య ఉన్న డంపింగ్ యార్డును తొలగించి ప్రజల ప్రాణాలను కాపాడాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్ కోరారు. ఉడ్‌పేట కంపోస్టు యార్డు వద్ద బుధవారం సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల క్రితం అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు కొత్తూరు గ్రామంలో ఉన్న డంపింగ్ యార్డును నెహ్రూచౌక్ సమీపంలో జనావాసాల మధ్య ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆక్షేపించారు. యార్డు చుట్టూ గృహాలు, వందల సంఖ్యలో విద్యార్థులున్న జీవీఎంసీ పెద్ద హైస్కూల్, ఎన్టీఆర్ క్రీడామైదానం, సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ ఉన్నాయన్నారు. డంపింగ్ యార్డు దుర్వాసనతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. ఈ ధర్నాలో సంఘం సభ్యులు అప్పారావు, రాముడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ



టాస్ వేసి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న అన్నంరెడ్డి అజయ్‌రాజ్

సబ్బవరం: నియోజకవర్గంలోని యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నియోజకవర్గ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్, వాలీబాల్ పోటీలు, స్త్రీ, పురుషులకు వేర్వేరుగా కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ చెప్పారు. ఈ నెల 21 ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ జన్మదినం సందర్భంగా పలు పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా మండలాల వారీగా క్రికెట్ పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన జట్లను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. రావలమ్మపాలెం పెద్దచెరువులో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం అజయ్‌రాజ్ చేతులమీదగా ప్రారంభించారు.

డీఈవోను కలిసిన పీఆర్టీయూ నేతలు



డీఈవోను సత్కరిస్తున్న పీఆర్టీయూ నేతలు

అనకాపల్లిటౌన్ : జిల్లా విద్యాశాఖాధికారిగా ఎం.వెంకటలక్ష్మమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఈవోను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పీఆర్టీయూ నేతలు కలిసి పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు పాల్గొన్నారు.

మోతాదుకు మించి పురుగు మందులు వాడితే చేటు



క్షేత్ర పరిశీలన చేస్తున్న వ్యవసాయాధికారులు

పరవాడ: మిత్ర, శత్రు పురుగుల నిష్పత్తిని గమనిస్తూ అవసరమైన మేరకు మాత్రమే పురుగు మందులు పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి చెప్పారు. జిల్లా వనరుల కేంద్రం(డీఆర్‌సీ), మండల వ్యవసాయశాఖ సంయుక్తంగా పరవాడలో బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వరిలో ఆకుముడత, కాండం తొలుచు పురుగులను నివారించేందుకు రైతులకు ట్రికార్డులు అందజేస్తామన్నారు. నత్రజని, భాస్వరం, పొటాషియంకు సంబంధించి సేంద్రియ ఎరువులు వాడే విధానాన్ని వివరించారు. అనంతరం రైతులతో సేంద్రియ ఎరువులు తయారు చేయించారు. పలు క్షేత్రాలను పరిశీలించి జింక్ లోపం ఉన్నట్టు గుర్తించారు. కార్యక్రమంలో డీఆర్సీ అధికారి విజేత, ఏఈవో ఎం.ఎస్.మూర్తి, వీఏఏ గౌతమి, రైతులు సిరపరపు సన్యాసినాయుడు,చుక్క అప్పలనాయుడు, లాలం సురేష్, పైల రామునాయుడు పాల్గొన్నారు.

రోడ్డులో గోతులతో ఇబ్బందులు



గోతులు ఏర్పడి అధ్వానంగా ఉన్న కొత్తతలారివానిపాలెం రహదారి

అనకాపల్లిటౌన్ : మండలంలోని కొత్తతలారివానిపాలెం రోడ్డు గోతులమయంగా మారింది. దీంతో ఈ రహదారిలో ప్రయాణించేందుకు ద్విచక్రవాహనదారులు భయపడుతున్నారు. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీనికి తోడు మురుగునీరు చేరడంతో లోతు తెలియక ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డులో గోతులు పూడ్చి, మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికిరూ. 50 వేల విరాళం

పరవాడ: జీవీఎంసీ 88 వార్డు నంగినారపాడు కొత్తూరులో చేపట్టనున్న శ్రీ దుర్గమాంబ ఆలయ నిర్మాణానికి పెదముషిడివాడ సర్పంచ్ పల్లా నాగమణి తనయుడు పల్లా అప్పారావు (కబడ్డీ) రూ.50 వేల విరాళాన్ని బుధవారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి విరాళాలు అందించి, హైందవ ధర్మం పరిరక్షణ, వ్యాప్తికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు కోరారు.

సరైన వేళల్లో పురుగు మందుల పిచికారీ

- వృధాను అరికడితే రైతుకు మరింత ఆదా



పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

అనకాపల్లి రూరల్ : వ్యవసాయ, ఉద్యాన పంటల్లో పురుగులు, తెగుళ్ల నివారణకు మందుల పిచికారీలో వేళలు కూడా ముఖ్యమేనని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఏ పంటకైనా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు మాత్రమే రసాయన మందులు పిచికారీ చేయాలి. మిట్ట మధ్యాహ్నం వేళ మందులు పిచికారీ చేస్తే ఎక్కువ శాతం ఎండలకు ఆవిరి రూపంలో గాలిలో కలిసిపోయి పంటకు చేరదు. అలాగే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా పిచికారీ చేయడం మంచిది కాదు. ఎండ తీవ్రత తక్కువగా ఉన్న సమయంలో గాలి వాటం చూసుకుని పురుగు మందు పిచికారీ చేస్తే పంటకు వినియోగమై మంచి ఫలితం ఉంటుంది. వరి, మిరప, నువ్వులు వంటి పంటలకు ఈ జాగ్రత్తలు తప్పనిసరిగా రైతులు పాటించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు సూచిస్తున్నారు. ఇలా చేయడం వలన పిచికారీ చేసిన మందు వృధాను అరికట్టడంతో పాటు కొంతమేర ఖర్చు ఆదా చేసినట్టేనని చెప్తున్నారు.

పురుగు మందు పిచికారీలో జాగ్రత్త



రైతులు పురుగు మందుల పిచికారీలో తప్పనిసరిగా తగు జాగ్రత్తలు పాటించాలి. సరైన మెలకువలు పాటిస్తే మందును, సాగు వ్యయాన్ని ఆదా చేయవచ్చు. రైతులకు ఏమైనా సందేహాలుంటే సమీపంలోని ఆర్బీకే సిబ్బందిని, లేదా వ్యవసాయాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవొచ్చు. దీని వలన సాగులో మంచి ఫలితాలు సాధించవచ్చు.

– పీయూటీపీ రంగాచారి, వ్యవసాయాధికారి